సాక్షి చిత్తూరు

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



మార్చి 3న పల్స్‌పోలియో

మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. - IIలో



మెటీరియల్ పంపిణీ

డీఎస్సీకి సన్నద్ధం అవుతున్న పేద అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. - IIలో



సీఎం పర్యటనపై సమీక్ష

కుప్పంలో ఈ నెల 26న సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జామవా సమీక్షించారు. - IIలో

న్యూస్‌రీల్

సీత మహత్ చరితమే రామాయణం

– చాగంటి కోటేశ్వరరావు



ప్రవచనాలు చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు

చిత్తూరు రూరల్: రాక్షస వధలో విరామం ఎరుగని రాముని, రామకథను ముందుకు నడిపించిన సీత మహత్ చరితమే రామాయణమని చాగంటి కోటేశ్వరరావు అన్నారు. చిత్తూరు నగరంలోని గురునగర్‌కాలనీలో గురువారం సీతమ్మకథపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ప్రారంభించారు. రామాయణంలో సీతదే కథంతా అన్నారు. సమస్త మానవీయ విలువలకు ధర్మరక్షణకు, అపురూపమైన కుటుంబ సంబంధాలకు, ప్రకృతికీ–మనిషికీ, నిస్వార్థ పరమార్థాలకు వెన్నుదన్నుగా నిలిచి నేటికీ కీర్తిని పొందేది రామాయణం అన్నారు. అయితే అంతటి సుందర రామ కథా మణిహారంలో కలికితురాయి సీత అన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆహుతుల పాల్గొన్నారు.

మంచి ఆలోచనలు జీవితాన్నే మార్చేస్తాయి



ర్యాలీ ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

పుత్తూరు: ఒక మంచి ఆలోచన జీవితాన్నే మార్చేస్తుందని జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గేట్‌పుత్తూరులోని స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్ స్టీఫెన్ స్మిత్ రాబర్ట్ బడన్ పవెల్ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ ఆలోచన దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరాలన్న ప్రతి విద్యార్థి ఆలోచన ఎంతో గొప్పదన్నారు. చిన్నతనం నుంచి సమాజసేవ చేయడానికి ముందుకు వచ్చిన ప్రతిఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా క్రమశిక్షణతో కూడిన సేవామార్గం అలవడుతుందని తెలిపారు. ఎయిడ్స్, పల్స్ పోలియో, పచ్చదనం పరిశుభ్రత వంటి పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న స్కౌట్ అండ్ గైడ్స్ సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ జయదేవ్, గైడ్స్ లీడర్ యువశ్రీ, శైలజ, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ దేవరాజు వెల్లడించారు. మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం డీఈఓ, సమన్వయ శాఖల అధికారులతో విజయవాడ నుంచి వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఇంటర్మీడియట్, పదో తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షల నిర్వహణపై చర్చించారు. జిల్లాలో చేపడుతున్న ఏర్పాట్లను డీఈఓ దేవరాజు వివరించారు. పది పరీక్షలకు 21,199 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చౌడేశ్వరి, సిబ్బంది ప్రేమకుమారి, సల్లార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం




మాట్లాడుతున్న వెంకట ప్రసాద్

చిత్తూరు రూరల్: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ అన్నారు. చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో గురువారం ఆయన ఏఎన్ఎం, రూట్ ఆఫీసర్లు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. మార్చి 3వ తేదీన పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు ఇటుక బట్టీల దగ్గర, భవనాల నిర్మాణం జరిగే చోట, ఇతరత్రా ప్రాంతాల్లో నివసించే పిల్లలకు కూడా విధిగా టీకాలు వేయించాలని తెలిపారు.

సంక్షేమానికి ఫ్యాన్స్

ప్రతిపక్షానికి నో చాన్స్





సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో 20 రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుంది. దీంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో అధికార పార్టీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ బాటలో పయనిస్తుంటే, టీడీపీ, జనసేన మాత్రం పొత్తులాట ఆడుతున్నాయి. సీఎం జగన్ సర్కారు సంక్షేమ పథకాల పంపిణీ, అభివృద్ధి పనులతో ప్రజల మధ్యన ఉంటే ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేన మాత్రం హస్తినలో పొత్తుల కిరికిరిలో బిజీగా ఉన్నాయి. దీంతో ఆయా పార్టీల కేడర్‌లో అభ్యర్థులెవరో తెలియక నిస్తేజంతో ఉంది.

- సంక్షేమం, అభివృద్ధితో జనం గుండెల్లో సీఎం జగన్
- అధికార పార్టీకి నీరాజనం
- ఎలా ఓట్లడగాలో తెలియక టీడీపీ, జనసేన అయోమయం
- ఇప్పటికీ కొలిక్కిరాని పొత్తుల పంచాయతీ
- అభ్యర్థులెవరో తెలియక అనిశ్చితి

సాక్షి, చిత్తూరు: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సిద్ధం అయింది. ఇటీవలే సీఎం జగన్మోహన్‌రెడ్డి భీమిలి, దెందులూరు, రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలతో పార్టీలో కొత్త ఉత్సాహం నిండింది. అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధే అజెండాగా సీఎం జగన్ సర్కార్ ముందుకెళ్తోంది. అయితే సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ, జనసేన పార్టీలు మాత్రం విషం కక్కుతున్నాయి. చిత్తూరు జిల్లాలో జీడీ నెల్లూరు, పుంగనూరు, నగరికి చెందిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా నిత్యం అధికార కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో సఫలీకృతమవుతున్నారు. ఇక కుప్పంలో ఎమ్మెల్సీ భరత్, పలమనేరులో వెంకటే గౌడ, చిత్తూరులో సమన్వయకర్త విజయానందరెడ్డి, పూతలపట్టులో సునీల్‌కుమార్ ప్రజల మధ్యే గడుపుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

ఆ పార్టీల్లో అయోమయం..

జిల్లాలోని తెలుగుదేశం, జనసేన పార్టీల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాలు ఉంటే చాలా చోట్ల ఇప్పటికీ అధికారికంగా అభ్యర్థులను ప్రకటించలేదు. జనసేనతో పొత్తుల నేపథ్యంలో ఏ నియోజకవర్గానికి ఎవరు ? అభ్యర్థి? అనే సందిగ్ధత కొనసాగుతోంది. జిల్లాలోని కుప్పం, పలమనేరు మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాలు పుంగనూరు, చిత్తూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీ నెల్లూరు, నగరిలో టీడీపీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల విషయంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ తరఫున చిత్తూరులో గురజాల జగన్‌మోహన్, కాజూరు బాలాజీ, మాజీ మేయర్ కఠారి అనురాధ కోడలు కఠారి హేమలత, డీకే ఆదికేశవులు కుమారుడు డీకే శ్రీనివాసులు, కుమార్తె తేజశ్వరి పోటీలో ఉన్నారు. ఇదే డీకే ఆదికేశవులు నాయుడు మనువరాలు మాత్రం ఇటీవల జనసేనలో చేరి చిత్తూరు టికెట్ తనదేనని సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయించుకుంటున్నారు.

- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మురళీ మోహన్‌ను గతంలో చంద్రబాబే స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు ఆయన ప్రచారం చేపడుతున్నా పార్టీ కేడర్ మాత్రం సహకరించడం లేదనే ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. చివరి క్షణంలో ప్రత్యామ్నాయంగా మరో అభ్యర్థి నిలబెట్టే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.
- పుంగనూరు టీడీపీ టికెట్‌ను చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు ఆశిస్తున్నారు. కానీ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవంతో పాటు నిత్యం ప్రజల మధ్యన ఉండే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పోటీ అంటే సామాన్యమైన విషయం కాదని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మరో బలమైన అభ్యర్థి కోసం వెతుకుతోంది. ఇటీవల సొంతంగా భారతీయ చైతన్య యువజన పార్టీ పెట్టినన రామచంద్రయాదవ్ కూడా పుంగనూరు నుంచే మరోసారి పోటీ చేసే యోచనలో ఉన్నారు. ఆర్థిక బలంతో పాటు కేంద్రంలో బీజేపీ పెద్దల ఆశీస్సులతో గెలవాలని భావిస్తున్నారు.
- జీడీ నెల్లూరు నుంచి టీడీపీ తరఫున చెన్నైలో ఫర్టిలిటీ సెంటర్ నిర్వహిస్తున్న థామస్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఆర్థికంగా బాగున్నా రాజకీయాల్లో పెద్ద అనుభవం లేకపోవడంతో ఆ పార్టీ కేడర్‌తో అతనికి పొసగడం లేదని ప్రచారం. ఇటీవల జీడీ నెల్లూరులో చంద్రబాబు పాల్గొన్న రా.. కదలిరా కార్యక్రమం నిర్వహణలో కూడా థామస్ వ్యవహరించిన తీరుపై పార్టీ కేడర్ అసంతృప్తితో ఉంది. దీంతో అభ్యర్థి మార్పు అంశం తెరపైకి వచ్చి చర్చ సాగుతోంది.
- నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా గాలి భానుప్రకాష్ కొనసాగుతున్నారు. ఆయన సొంత తమ్ముడు గాలి జగదీష్ మాత్రం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తున్నారు. దీనికితోడు టీడీపీ కేడర్‌తో, సీనియర్ నేతలతో భానుప్రకాష్‌కు సత్సంబంధాలు లేవనే మాటలు వినిపిస్తున్నాయి. అందువల్లే పార్టీలో సీనియర్ నేతలు అశోక్‌రాజు, విజయ్‌బాబు, పాకా రాజా, రమేష్‌నాయుడు వంటి వారు దూరమయ్యారు. ఈసారి టికెట్ రేసులో వారు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో అభ్యర్థి విషయంలో ఆ పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది.

కుదరని పొత్తుల పితలాటకం..

చిత్తూరు జిల్లాలో జనసేన ప్రభావం ఏమాత్రం కనిపించడం లేదు. చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో తిరుపతి జిల్లాలో ఆ పార్టీకి చెప్పుకోదగ్గ నాయకులు లేరు. ఇక ఉన్నవాళ్లు కూడా టీడీపీ నేతలతో పొసగట్లేదు. టీడీపీ, జనసేన పొత్తు ప్రకటించనప్పటికీ ఆ ప్రభావం జిల్లాలో కనిపించలేదు. ఇంతవరకు జిల్లాలో, నియోజకవర్గ స్థాయిలో ఆ రెండు పార్టీ నేతలు, కేడర్ కలసి నడిచిన సందర్భాలు లేవు. చిత్తూరుకు చెందిన డీకే ఆదికేశవులు నాయుడు మనువరాలు చైతన్య ఇటీవల జనసేనలో చేరడంతో ఆ ఇంట్లోనే త్రిముఖ పోరు నెలకొంది. అయితే పొత్తులో భాగంగా ఏ పార్టీకి టికెట్ వచ్చినా ఆ కుటుంబంలో వారికే ఇవ్వాల్సి వస్తుంది. ఈ ప్లాన్‌తోనే వారు ఇరు పార్టీల్లో పాగా వేస్తున్నారు.

కుటుంబ గొడవలకు పార్టీ రంగు



గ్రామాలలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న గొడవలకు పచ్చ పత్రిక రంగు పూసేస్తుంది. ఎక్కడ ఏమీ జరిగినా, ఎలాంటి సంఘటనలు జరిగినా వైఎస్సార్‌సీపీ వారే చేశారని తప్పుడు రాతలు రాయడం ఆనవాయితీగా మారింది. బంగారుపాళెం టేకుమందలో ఒకే కుటుంబానికి చెందిన టీడీపీ మద్దతుదారులు కొట్లాడుకుంటే వైఎస్సార్ సీపీ వారు దాడి చేశారని నిసిగ్గుగా వార్త రాయడంపై గ్రామస్తులు అసహ్యించుకుంటున్నారు. ఇంత అసత్యాలు రాస్తారా అని నవ్వుకున్నారు. వివరాలు..

- తీరు మారని పచ్చపత్రిక
- నిజాలు రాస్తే గౌరవం ఉంటుంది
- రాష్ట్ర కురబ సంఘు కార్యదర్శి

బంగారుపాళ్యం: మండలంలోని టేకుమంద గ్రామంలో మూడు రోజుల కిందట టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రచార కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లారు. అదే సమయంలో గ్రామానికి చెందిన హంసవేణి తమ ఇంటి పక్క, వెనుక వైపు పక్క ఇంటివారు అపరిశుభ్రం చేస్తున్నారని, దీంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నానని ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తమ ప్రభుత్వం రాగానే అంతా సిమెంట్ రోడ్లు వేస్తామని హామీ ఇచ్చి వెనుతిరిగారు. దీనిపై పక్క ఇంటిలోని ఇద్దరు మహిళలు తమపై ఫిర్యాదు చేస్తావా అంటూ ఘర్షణకు దిగి, హంసవేణిని గాయపరిచారు. దీనిపై ఆమె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇదంతా బాగున్నా వెంటనే అక్కడ ఉన్న టీడీపీ నాయకులు దాడి చేసిన వారు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులని నోరుపారేసుకున్నారు. వారికి, వారి కుటుంబాలకు సంబంధించి ఎవ్వరికీ వైఎస్సార్‌సీపీకి చెందిన స్నేహితులు, బంధువులు లేకపోయినా పచ్చపత్రిక దీన్ని భూతద్దంతో కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని చదివిన గ్రామస్తులు దాడి చేసిన వారు టీడీపీ మద్దతుదారులేనని, వారి బంధువులు కూడా ఇంతక ముందు, ఇప్పుడు టీడీపీలోనే ఉన్నారని చెప్పుకుంటూ నవ్వుకున్నారు. దీనిపై అదే గ్రామానికి చెందిన కురబ సంఘం రాష్ట్ర కార్యదర్శి అమరనాథ్ మాట్లాడుతు దాడి చేసిన మహిళల బంధువు కొండమ్మ గతంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారు, గొడవ చేసిన వారు టీడీపీ మద్దతుదారులేనని, ఎవ్వరూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కాదని స్పష్టం చేశారు. పత్రికలు నిజాలు రాయాలని సూచించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ మైనారిటీ కార్యకర్తలతో ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప

- ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప సమక్షంలో చేరిక

రామకుప్పం: మండలంలోని గొరివిమాకులపల్లికి చెందిన మైనారిటీ కార్యకర్తలు 10 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఇమామ్‌సాబ్, హఫీజ్, జియావుల్లా, బాబాసేట్, వజీర్ బాషా, నారాయణ గౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, మండల కోఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, నేతలు అశోక్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వేణప్ప గౌడు, తాజ్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ మేరకు కుప్పానికి కృష్ణాజలాలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 26న కుప్పంలో కృష్ణా జలాలను విడుదల చేయడానికి సీఎం జగన్ రామకుప్పం, శాంతిపురం మండలాలకు విచ్చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. గురువారం రామకుప్పం పంచాయతీ ఆకందగానిపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సీఎం పర్యటనకు సంబంధించి ఎమ్మెల్సీ, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రెడ్డెప్ప సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కృష్ణాజలాలను హంద్రీ–నీవా కాలువ ద్వారా కుప్పానికి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కుప్పంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం అయ్యేలా పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని వారు కోరారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించండి

చిత్తూరు కలెక్టరేట్ : నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ షణ్మోహన్ నూతన సీఈఓకు సూచించారు. జెడ్పీ సీఈఓగా నియమితులైన గ్లోరియా గురువారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలో అమలయ్యే సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయాలన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూతన జెడ్పీ సీఈఓ గ్లోరియా

పరిశీలన తర్వాతే మినహాయింపు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందిని నేరుగా పరిశీలించిన తర్వాతే విధులకు మినహాయింపు ఇస్తున్నారు. కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఉద్యోగులను స్వయంగా పరిశీలిస్తున్నారు. ప్రతి రోజు శాఖల వారీగా విధుల మినహాయింపునకు అర్హత ఉన్న ఉద్యోగులను కలెక్టరేట్‌కు పిలిచి పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి ఉద్యోగుల ఎన్నికల విధులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 19,500 మంది ఉద్యోగులను ఎన్నికల్లో వివిధ విధులకు నియమించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో పలు ఆరోగ్య కారణాలతో 970 మంది మినహాయింపులు కోరుతూ ఉన్నతాధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు.

మామిడిలో సస్యరక్షణ చేపట్టండి

- జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి



రైతులకు సూచనలు ఇస్తున్న హార్టికల్చర్ ఆఫీసర్ దశరథరామిరెడ్డి

పుత్తూరు: పూత దశలోని మామిడి తోటల్లో సస్యరక్షణ పనులు చేపట్టాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరథరామిరెడ్డి సూచించారు. గురువారం వడమాలపేట మండలం ఎస్బీఆర్ పురం గ్రామంలో మామిడి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులకు పంట సస్యరక్షణపై సూచనలు ఇచ్చారు. తోటల్లో తేనె మంచు పురుగు ఉధృతంగా ఉన్న నేపథ్యంలో బుప్రోఫెజిన్ 1.5 మి.లీ, హెక్సాకోనోజోల్ 2 మి.లీ. వర్యాంకోజెబ్ 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే తోటల్లోని తెగుళ్ల నివారణకు బ్లిటాక్స్ 3 గ్రాముల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పూత వచ్చిన తోటల్లో ప్రస్తుతం తేలిక పాటి తడి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు శేఖర్‌రాజు, వెంకటరామరాజు, శ్యామసుందర్, మండల ఉద్యానవన శాఖ అధికారి వెంకటసౌజన్య పాల్గొన్నారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.83.18 లక్షలు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.83.18 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. హుండీలలో కానుకలను లెక్కించగా నగదు రూ.83,18,418, బంగారం 26 గ్రాములు, వెండి 330 గ్రాములు సమకూరినట్లు చెప్పారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.65,423 సమకూరిందన్నారు. ఈ ఆదాయం 56 రోజులకు వచ్చినట్లు ఈఓ చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, పాలక మండలి సభ్యులు రాజేష్, హైమావతి, భాస్కర్‌రెడ్డి, బుడ్డమ్మ, ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బోయకొండలో హుండీ కానుకలను లెక్కింపును పరిశీలిస్తున్న చైర్మన్ నాగరాజారెడ్డి

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,191 మంది స్వామివారిని దర్శించుకోగా, 22,295 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

25న షబేబరాత్ పండుగ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 25వ తేదీన ముస్లింలు షబేబరాత్ పండుగను జరుపుకోవాలని జిల్లా ప్రభుత్వ ఖాజీ సయ్యద్ మహమ్మద్ కమాలుల్లా జుహూరి లతీఫీ జునైదీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలంతా మరణించిన పూర్వీకులు ఆత్మలకు శాంతి పొందేలా ప్రార్థనలు చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

క్లుప్తంగా

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి



శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్



శ్రీనివాసులు (ఫైల్)

శాంతిపురం: చెట్టుపైకి ఎక్కి కింద పడి చికిత్స పొందుతూ కెనమాకుల పల్లికి చెందిన శ్రీనివాసులు(52) మృతి చెందాడు. వివరాలు.. గత మంగళవారం శ్రీనివాసులు తమ చింత చెట్టులో కాయలు రాల్చేందుకు చెట్టు ఎక్కి పట్టు తప్పి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచాడు. గురువారం కెనమాకులపల్లిలో అంత్యక్రియల సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ గ్రామానికి విచ్చేసి శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళి అర్పించారు. తక్షణ సాయంగా రూ.10 వేల నగదును అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, సర్పంచ్ ఏవీ జయరాం పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలో ఈ నెల 26న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు చేయాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా గురువారం సమీక్షించారు. రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద, శాంతిపురం మండలంలోని మఠం వద్ద హెలీప్యాడ్ల నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించారు. మఠం వద్ద రైతులు, ప్రజలతో జరిగే బహిరంగ సభ ప్రాంగణంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సభకు హాజరయ్యే వారికి ఇబ్బంది లేకుండా నీరు, మజ్జిగ ప్యాకెట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాజుపేట వద్ద కుప్పం కెనాల్‌కు నీటి విడుదల అనంతరం సీఎం మఠం వద్ద సభలో పాల్గొంటారని చెప్పారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా

ముస్లిం ఉద్యోగులకు ఒక గంట అనుమతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ముస్లిం ఉద్యోగులకు ఒక గంట అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు రంజాన్ పండుగను పురస్కరించుకుని మార్చి 11 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఉద్యోగులకు ఉత్తర్వుల ప్రకారం ప్రార్థనల కోసం గంట పాటు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను ఉత్తర్వుల్లో ఆదేశించారు.

100 లీటర్ల సారా స్వాధీనం

గుడిపాల: 500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేయడంతో పాటు 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. వివరాలు.. గురువారం రాసనపల్లె వంకలో సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామని ఎస్ఐ తెలిపారు. అక్కడ 500 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేయడంతో పాటు 100 లీటర్ల సారా ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాసనపల్లెకు చెందిన అరుణ్‌కుమార్(33) పరారు కాగా, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎన్నికల విధులకు మినహాయింపు ఇవ్వండి



డీఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఎన్నికల విధులకు మినహాయింపులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మునాఫ్ కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు గురువారం డీఆర్‌ఓ పుల్లయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో పలువురు టీచర్లు అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులు, వివిధ కారణాలతో మినహాయింపులు కోరుతున్నారని తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో చంటిపిల్లలు కలిగిన మహిళా టీచర్లు కలెక్టరేట్‌కు హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి చంటిపిల్లల టీచర్లు కలెక్టరేట్‌కు రాలేరని చెప్పారు. తహసీల్దార్ల సమక్షంలో పరిశీలన చేసి మినహాయింపులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హేమాద్రి, గోపీనాథ్, మునీర్, మదన్‌మోహన్‌రెడ్డి, రామ్మూర్తి, దేవరాజులురెడ్డి, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

నగరి : జిల్లావ్యాప్తంగా మార్చి 3వ తేదీ నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని 100 శాతం విజయవంతం చేసేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమ సన్నద్ధతపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు ఐసీడీఎస్, కార్మిక శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, మెప్మా తదితర విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3న పెద్దఎత్తున పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. మార్చి 4, 5 తేదీల్లో ఇంటింటి సర్వే చేసి, మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శేఖర్, ఎంఈఓ నమశ్శివాయం, వైద్యాధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీగొల్లపల్లి సిద్ధార్థ కళాశాలలో మెగా క్యాంపస్ సెలక్షన్స్

– 224 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ కొండారెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మెగా క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి వచ్చి 601 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిని హైదరాబాదు, బెంగళూరు, చెన్నైకి చెందిన 21 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. 224 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి తెలిపారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, కార్యదర్శి ఆనందరెడ్డి, విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



నవీన్ నాయుడుకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్, ధనంజయ రెడ్డి, సురేష్‌బాబు

యాదమరి: మండలంలోని జంగాలపల్లెకు చెందిన టీడీపీ నాయకులు నవీన్ నాయుడు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకుని పార్టీలో చేశారు. గురువారం మండలంలోని మాధవరం పంచాయతీలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఎంపీపీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో జంగాలపల్లెకు చెందిన నవీన్ నాయుడుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నవీన్ నాయుడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ

– జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఓటమిని అంగీకరించకుండా సన్నద్ధం అవ్వాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె జిల్లాకేంద్రంలోని మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ పరీక్షకు ప్రిపేరవుతున్న 50 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఎదుర్కొని పోటీ పరీక్షలకు సన్నద్ధమై విజయం సాధించిన వారెందరో ఉన్నారని చెప్పారు. ఫెయిల్యూర్‌కు సాకులు చెప్పకూడదన్నారు. మన ఫెయిల్యూర్‌కు మనమే కారణం అని తెలిపారు. టాలెంట్ ఉంటేనే పోటీ పరీక్షల్లో రాణించగలమన్నారు. స్టడీ సెంటర్ డైరెక్టర్ పవనకుమారి మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పేద అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా గ్రంథాలయాల్లో డీఎస్సీ అభ్యర్థులకు దాదాపు 500 సెట్లు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ సీఈఓగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా బాధ్యతలు గురువారం స్వీకరించారు. ఆమెను గత సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆమెకు ఏఓలకు, సిబ్బందికి పరిచయం చేయగా వారు సన్మానించి పరిచయం చేసుకున్నారు. ఇక్కడ సీఈఓగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీగా వెళ్లిన విషయం తెలిసిందే.



నూతన సీఈఓ గ్లోరియాకు బాధ్యతలు అప్పగిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

బైక్ దొంగల అరెస్ట్

తిరుపతి క్రైమ్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగలు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నివాసముంటున్న కాకాశి సాత్విక్ అలియాస్ గోకుల్, షేక్ అబ్దుల్ కరీం, ఎర్ర బాలాజీ, జస్వంత్, ధనశేఖర్ ముఠాలుగా ఏర్పడి గత కొన్ని నెలలుగా తిరుపతి నగరంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడేవారు. ఆపై వాటిని విక్రయించి జల్సాలు చేసుకునేవారు. ఈ క్రమంలో క్రైమ్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ, అతని బృందం గురువారం మధ్యాహ్నం తిరుపతి అలిపిరి బైపాస్ రోడ్‌లోని టాటా క్యాన్సర్ హాస్పిటల్ వద్ద దొంగలను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.12.5 లక్షల విలువ చేసే 16 మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాకాశి సాత్విక్ పాత నేరస్తుడుకాగా అతనిపై డికాయిటీ, రాబరీ రాత్రి వేళల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడడం తదితర కేసులు ఉన్నాయి. మిగతా వారందరూ కూడా నేరచరిత్ర కలిగిన వారిని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

24న మాదక ద్రవ్యాల నిషేధంపై ర్యాలీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్: డ్రగ్స్, మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థుల్లో అవగాహన నిమిత్తం ఈ నెల 24న చిత్తూరులో ×స్టూడెంట్స్ ఎన్ టైటిల్మెంట్ ర్యాలీ ఫర్ యాంటీ డ్రగ్స్₹ కార్యక్రమం నిర్వహించినట్లు నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్ శామ్యూల్ కిమ్ తెలిపారు. చిత్తూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వాటి జోలికి వెళ్లకుండా అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. చిత్తూరులోని శర్మన్ బాలికోన్నత పాఠశాల నుంచి ర్యాలీ ప్రారంభమై పాత కోర్టు మీదుగా గాంధీ విగ్రహ కూడలి వరకు ర్యాలీ ముగుస్తుందని, అక్కడే ముగింపు ప్రసంగం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, న్యాయ సేవాసదన్ అధికారులను ర్యాలీలో పాల్గొనాలని సంప్రదించామని, యువత, వివిధ సంఘాలు, ప్రజలు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంస్థ న్యాయ సలహాదారు విజయకుమార్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జోబ్, జాతీయ డైరెక్టర్ నాగరాజు రెడ్డి, ఢిల్లీబాబు పాల్గొన్నారు.

అపురూపం..ఆసక్తికరం



సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాలలో ఒకే చోట 22 కవల జంటలు

చిత్తూరు కలెక్టరేట్ : ఒకే కాన్పులో పుట్టిన కవలలు అపరూపంగా ఉంటారు. చూసే వారిని తికమక పెడుతారు. వారి ఆలోచ నలు, అభిరుచులు ఒక్కటిగా ఉంటాయి. కొందరినైతే గుర్తుపట్టడం అంత తేలికకాదు. కవలల దినోత్సవం సందర్భంగా చిత్తూరు సంసిద్ధ్ క్యాంఫోర్డ్ పాఠశాలలో 22 కవల జంటలు ఒకే ఫ్రేమ్‌లో కనువిందు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఒకే రూపంలో ఉండే కవలలంటే ఇష్టపడని వారు ఉండరని, మనుషులు వేరైనా...పొలికొక్కటే అని అన్నారు. తమ పాఠశాలలో చదువుతున్న 22 మంది కవలలు ఒకే పోలికతో సమరూప, సహజాత కవలలు అని అనిపించుకుంటున్నారన్నారు. అనంతరం కవల జంటల విద్యార్థులకు పలు క్రీడాపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు భారతి, సురేష్, వినోద్‌కుమార్, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె పంచాయతీ కమ్మొళ్లపల్లె సమీపంలో గుర్తు తెలియని శవం ఒకటి గురువారం బయటపడింది. కల్లూరు సీఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు.. ఎవరో గుర్తు తెలియని, సుమారు 40 ఏళ్ల వయసున్న వ్యక్తి సుమారు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని సమాచారం. గురువారం ఉదయం కమ్మొళ్లపల్లె గ్రామస్తులకు మృతి చెందిన శవం వాసన రావడంతో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన రొంపిచెర్ల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ తులసీరామ్‌తో సంఘటనా స్థలానికి వెళ్లి శవాన్ని పరిశీలించారు. అయితే మృతుడు బయట రాష్ట్రాలకు చెందిన వ్యక్తి అయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం కోసం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

